'దీక్షా దివస్'ను విజయవంతం చేయండి

డిచ్‌పల్లి/ధర్పల్లి/ఆర్మూర్‌టౌన్/రెంజల్/నవీపేట, నవంబర్ 28: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని డిచ్‌పల్లిమండల నాయకుడు శక్కరికొండ కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ధర్పల్లి మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు దీక్షాదివస్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ కోరారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ కోరారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. పార్టీ నాయకులు మీరా శ్రవణ్, అగ్గ క్రాంతి, మాక్లూర్ రాజు తదితరులు పాల్గొన్నారు. దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నవీపేట మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు, రెంజల్ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

డిచ్‌పల్లి, నవంబర్ 28: డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం యువత కృషి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావు పిలుపునిచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన వాల్ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగంతో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా నష్టంతోపాటు ప్రాణనష్టం కూడా జరుగుతుందన్నారు. గంజాయి, సిగరెట్, అల్రాజోలం తో తయారు చేసిన కల్తీ కల్లుకు బానిసలు కాకూడదన్నారు. టీయూలో త్వరలోనే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేస్తామని వీసీ తెలిపారు. ప్రిన్సిపాల్ ఆరతి, ఆడిట్ సెల్ డైరక్టర్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ

జిల్లాకు నేడు రోడ్లు, భవనాల శాఖ మంత్రి రాక

కంఠేశ్వర్/ ధర్పల్లి, నవంబర్ 28: జిల్లాకు నేడు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారు. ఇందల్వాయి, ధర్పల్లి మండలాల్లో వివిధ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ధర్పల్లిలో తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనులకు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డితో కలిసి భూమిపూజ చేయనున్నారు.అనంతరం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటు

ఖలీల్‌వాడి, నవంబర్ 28 : ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోటు ప్రసాద్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటు అని నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ .. రాష్ట్ర సాధన ఉద్యమంలో పోటు ప్రసాద్ కీలకంగా పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు రఘురాం, రాజ్‌కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

ఆహారం కలుషితం కాకుండా చూడాలి

- ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- రాంపూర్‌లో జ్యోతిబా పూలే పాఠశాల తనిఖీ

డిచ్‌పల్లి, నవంబర్ 28 : ప్రభుత్వ వసతి గృహాల్లో ఏ దశలోనూ ఆహారం కలుషితం కాకుండా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. గురువారం ఆయన మండలంలోని రాంపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే, బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆహార పదార్థాలను భద్రపర్చే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారుచేసేలా చూడాలన్నారు. కూరగాయలు, ఆహార పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ నేలపై ఉంచకుండా స్టీల్ డబ్బాలలో భద్రపర్చాలని, వాటిపై తప్పనిసరిగా మూతలు బిగించాలన్నారు. భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాలు నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన పదార్థాలు వినియోగించకూడదని సూచించారు. విద్యార్థులకు వడ్డించడానికి ముందు రుచి చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. నాసి రకమైన బియ్య,ం నూనె, ఇతర సరుకుల సరఫరా జరిగితే వెంటనే తహసీల్దార్ దృష్టికి తేవాలన్నారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రభకర్. స్థానిక అధికారులున్నారు.

బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్

బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తే కఠిన చర్యలు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా వెంటాదివెంట టాబ్ ఎంట్రీలు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. టాబ్ ఎంట్రీల్లో నిర్లక్ష్యానికి తావిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాంపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించినప్పటికీ ట్రాక్ షీట్లను తెప్పించుకోవడం, టాబ్ ఎంట్రీలు చేయడంలో నెలకొన్న జాప్యంపై కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో వారి ఖాతాల్లో బిల్లుల చెల్లింపులు జరగాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని నిలదీశారు. బిల్లుల కోసం రైతులు నిరీక్షించే పరిస్థితి ఉత్పన్నం కాకుండా సత్వరమే ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసేలా పర్యవేక్షణ చేయాలని స్థానిక తహసీల్దార్ ప్రభాకర్‌ను ఆదేశించారు.

రుచికరమైన భోజనం అందించాలి

సిరికొండ, నవంబర్ 28 : విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం మండలంలోని సర్పంచ్ తండా కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన ఆహారం అందించాలన్నారు. సన్నబియ్యం, వంట సరుకులతో పాటు వండిన వంటలను పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంఈవో రాములు ఉన్నారు.

స్వగ్రామంలో దేశాయ్ అంత్యక్రియలు

హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

కోటగిరి(పొతంగల్), నవంబర్ 28 : కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ శివరాజ్ దేశాయ్, ఆయన కుమారుడు రాజు దేశాయ్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఆయన స్వగ్రామం బస్వాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించగా.. వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్ రెడ్డి, యెండల లక్ష్మీ నారాయణ, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పార్థివదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, శంకర్ పటేల్, పుప్పాల శంకర్, వల్లేపల్లి శ్రీనివాస్‌రావు, గంగాధర్ పటేల్, ఎలమంచిలి శ్రీనివాస్‌రావు, అంబర్ సింగ్, కొట్టం మనోహర్, పత్తి లక్ష్మణ్, ప్రకాశ్ పటేల్, మాధవ్ యాదవ్, సాయికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల పార్టీ బీజేపీని ఎవరూ నమ్మరు

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సారంగాపూర్, నవంబర్ 28: మాయమాటలు చెప్పి కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ జూటా పార్టీ అని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని కేశాపూర్ గ్రామంలో రూ.5.43 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు, రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన మోదీ ప్రభుత్వం ఉన్నత వర్గాలకు, బడా బాబులైన అదానీ, అంబానీల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పేద, అన్నివర్గాల ప్రజాసంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, బాగారెడ్డి, ఎల్లయ్య, కుమార్‌రెడ్డి, పూర్ణచందర్‌రాజ రాజేంద్రప్రసాద్, అమృతాపూర్ గంగాధర్, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

కోటగిరి(పోతంగల్), నవంబర్ 28: దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌పీఆర్‌డీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోటగిరి తహసీల్ ఆఫీస్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా దివ్యాంగులకు రూ. 6వేల పెన్షన్ వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఐదు శాతం కేటాయించడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డును అందజేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోగా కాలయాపన చేస్తూ దివ్యాంగులను మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 30న బోధన్ ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న దీక్షకు జిల్లాలోని దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, బీడీ కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శివకుమార్, కోశాధికారి గోలి వెంకట్‌రావు, ఉపాధ్యక్షులు కాసుల రాజకుమార్, తోట సాయిలు, కొండ బాయ్, సహాయ కార్యదర్శులు గొల్ల శ్రీను, కాయపల్లి లక్ష్మణ్, లక్ష్మీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా

టీయూలోని లా కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం స్పందించాలి

ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి, నవంబర్ 28 : రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని టీయూ ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. దీనిపై సీఎం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం టీయూలోని లా కళాశాల ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు శివ మాట్లాడుతూ.. కలుషిత ఆహారం తిని ఓ విద్యార్థిని మృతి చెందడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. ఫుడ్ ఫాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సరిత, భవానీ, సాగర్, వేణు, హరీశ్, గణేశ్, భానుప్రసాద్, రాకేష్, వంశీ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి రాచకోండ విష్ణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **ట్రాఫిక్ సీఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ:** వినాయక్‌నగర్, నవంబర్ 28: నిజామాబాద్ ట్రాఫిక్ సీఐగా పబ్బ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన వీరయ్య పీసీఆర్(పోలీస్ కంట్రోల్ రూం)కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా డీసీఆర్‌బీ(డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో)గా పని చేసిన ప్రసాద్‌కు పోస్టింగ్ కల్పించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- **పలు గ్రామాల్లో కళాయాత్ర:** ఇందల్వాయి, నవంబర్ 28 : మండలంలోని గన్నారం, సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల్లో ప్రజాపాలన, ఆరు గ్యారెంటీలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు గురువారం అవగాహన కల్పించారు. కళాకారులు సతీశ్, నర్సయ్య, రాంపూర్ సాయి డప్పు రాజు, రవినాయక్, సమతా మనోజా, మీనా, రషీద్ కళాకారులు పాల్గొన్నారు.
- **ఆలయ పునర్నిర్మాణానికి విరాళం:** రుద్రూర్, నవంబర్ 28 : మండల కేంద్రంలోని శ్రీరామాలయ మందిర పునః నిర్మాణంలో భాగంగా వర్ని మండలం తగిలేపల్లి గ్రామానికి చెందిన గంగా వెంకటేశ్వర్ (శ్రీ వెంకటేశ్వర బిన్నీ రైస్‌మిల్) గురువారం రామాలయ కమిటీ సభ్యులకు 1,01,116 రూపాయల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో పత్తి రాము స్వామి, అడప నవీన్, పత్తి నవీన్ స్వామి, బచ్చు పవన్ తదితరులు ఉన్నారు.
- **ఆలయాల్లో హుండీ లెక్కింపు:** సుభాష్‌నగర్, నవంబర్ 28: జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ మందిరం, గోల్ హనుమాన్ దేవాలయం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ పరిశీలకురాలు కమల ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. గోల్‌హనుమాన్ ఆలయం రూ. 41,120, జెండా బాలాజీ దేవస్థానం రూ. 63,600 ఆదాయం వచ్చినట్లు ఉమ్మడి ఆలయాల ఈవో వేణు తెలిపారు.
- **4న రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం:** సుభాష్‌నగర్, నవంబర్ 28: ఆర్మూర్‌రోడ్ దాస్‌నగర్ నవ్యభారతీ గ్లోబల్ స్కూల్లో హరిదా రచయితల సంఘం 6వ మహాసభ సందర్భంగా డిసెంబర్ 4 సాయంత్రం 5గంటలకు రాష్ట్రస్థాయి కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మేళనంలో పాల్గొనే కవులు, కవయిత్రులు 8897213286, 8347002227 నంబర్లను సంప్రదించాలని సూచించారు.
- **నేడు ఇస్కాన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన :** సుభాష్‌నగర్, నవంబర్ 28: బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ దేవాలయాలు, సన్యాసులు, ప్రచారకుల మీద జరుగుతున్న దాడులు, అక్రమ అరెస్టులను నిరసిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు కంఠేశ్వర్ ఇస్కాన్ అధ్యక్షులు రామానంద రాయ్ గౌరదాస్ పత్రిక ప్రకటనలో తెలిపారు.

ఫ్యాక్టరీ ఎత్తివేయాలని ఆందోళన

వినాయక్‌నగర్,నవంబర్ 28: నగరంలోని ఐదో పోలీసు స్టేషన్ పరిధిలో సాయినగర్‌లో ఏర్పాటు చేసిన విస్తార్లు తయారుచేసే ఫ్యాక్టరీ నుంచి వస్తున్న దుర్వాసనతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇండ్లలో ఉండలేకపోతున్నామంటూ కాలనీవాసులు గురువారం ఆందోళన చేపట్టారు. స్థానికులు, మహిళలు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఫ్యాక్టరీని ఈ ప్రాంతం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకొని నిర్వాహకులతో మాట్లాడారు. ఫ్యాక్టరీని తొలగించాలని నిర్వాహకులకు సూచించి, కొన్ని రోజుల పాటు గడువు ఇచ్చారు.

గుడికి వెళ్లి తిరిగి వచ్చేసరికి.. ఇంట్లో చోరీ

వినాయక్‌నగర్, నవంబర్ 28: నగర శివారులోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం ఓ తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లోని వారి గుడికి వెళ్లి తిరిగి వచ్చే సరికి దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. సంజీవ్‌రెడ్డి కాలనీలో నివాసం ఉండే శ్రీనివాస్‌రెడ్డి శాంతి హోమం చేయించడానికి కుటుంబ సభ్యులందరూ ఆలయానికి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం ధ్వంసం చేసి ఉండడం, గదిలోని బీరువాలో వస్తువుల,ఇతర సామాన్లు చిందరవందరగా పడవేసి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు నగలతో పాటు కొంత నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు.బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి,దర్యాప్తు చేపట్టారు.

గొప్ప దార్శనికుడు జ్యోతిబా పూలే



జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్మన్

ఖలీల్‌వాడి/ సిరికొండ/ ఆర్మూర్‌టౌన్/ భీమ్‌గల్, నవంబర్ 28: తన భార్యకు విద్య నేర్పి దేశ ప్రథమ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని పలువురు బీసీ సంఘాల నాయకులు కొనియాడారు. గురువారం జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. నగరంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, సభ్యులు ఆంజనేయులు, దేవేందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, గురుచరణం, జయ, రుక్మిణి, సత్యనారాయణ, జనార్దన్ పాల్గొన్నారు.జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు. సిరికొండలో సత్యశోధక్ పాఠశాలలో సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తాహెర్‌బిన్ హందాన్, సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్.నర్సయ్యతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్మూర్ పట్టణంలోని కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమ్‌గల్ మండల కేంద్రంలో పూలే విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రీడా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

బోధన్, నవంబర్ 28: విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకోవాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి స్రవంతి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థుల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ హాస్టళ్ల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి పోటీలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా సహాయ సంక్షేమ అధికారి నర్సయ్య, గంగాధర్, 33 వసతి గృహాల సంక్షేమ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి స్రవంతి

బాలికల కబడ్డీ జట్టు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులతో సెలక్షన్ జిల్లా సభ్యులు

ముప్కాల్, నవంబర్ 28: హైదరాబాద్‌లో వచ్చే నెల 7 నుంచి నిర్వహించనున్న 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్ ఉమెన్స్ (బాలికల) పోటీలకు నిజామాబాద్ జిల్లా బాలికల జట్టును గురువారం ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి తెలిపారు. 150 మంది పాల్గొనగా 20 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ముప్కాల్ భూదేవి ఇండోర్ స్టేడియంలో 20 మంది క్రీడాకారిణులకు పోటీలు నిర్వహించి 12 మందిని ఎంపిక చేస్తామన్నారు. కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు అంద్యాల లింగయ్య అధ్యక్షతన ఇట్టి ఎంపిక విధానం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కబడ్డీ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ట్రెజరర్ సురేందర్, పీడీలు రాజ్‌కుమార్, రాజేందర్, అనురాధ, జ్యోతి, మల్లేశ్‌గౌడ్, ప్రసాద్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నతంగా తీర్చిదిద్దాలి..

బోధన్ రూరల్/బాల్కొండ, నవంబర్ 26: విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో సామర్థ్యాలను సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేసి వారిని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని బోధన్ ఎంఈవో నాగయ్య అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని డిప్యూటీ డీఈవో కార్యాలయంలో గురువారం బోధన్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బోధన్ ఎంఈవో నాగయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెచ్ఎంలు సూర్యకుమార్, రత్నాకర్, సీఆర్పీలు విజయ్, బాబూ, యూసుఫ్, విజయ, రేఖ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండలో హెచ్ఎంలతో ఎంఈవో రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. వివిశ అంశాలపై చర్చించారు.

పాఠశాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, నవంబర్28: ఫత్తేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పిప్రి కాంప్లెక్స్ హెచ్ఎం విశ్వనాథ్ గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే సరుకుల నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు.

విద్యార్థినికి అభినందన

రెంజల్, నవంబర్ 28: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని మాలతి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించడంతో గురువారం ప్రిన్సిపాల్ ఫిరోజ్‌హైమద్ అభినందించారు. ఈనెల 22 నుంచి 24 వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 68వ వెయిట్ లిఫ్టింగ్ 81 కేజీల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిందని తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ శాఖ పోలీసులు

ఆర్మూర్‌టౌన్,నవంబర్28: మామిడిపల్లి చౌరస్తా వద్ద హైదరాబాద్ వెళ్లే మార్గంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్టీవెన్‌సన్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. గంజాయి రవాణా చేస్తున్న మహ్మద్ వాహిద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు స్టీవెన్ సన్ తెలిపారు. నిందితుడి వద్ద ఒక కేజీ 100 గ్రాముల ఎండు గంజాయి, పల్సర్ బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు త